# 2

# పాలు

(రచనా కాలం 1980)

వర్షం. ఒకటే వర్షం.
బురద. ఎటు చూసినా బురద.
చినుకులు. తుంపర చినుకులు.
ఈదర, చలి. చలి ఈదర.

వాతావరణం అంతా కసుక్కు కిసుక్కు. కిసుక్కు కసుక్కు.
విడవని దుఃఖంలా వెలవని వర్షం.

తెరలు తెరలుగా, పొరలు పొరలుగా పొంగుతూ చల్లారుతూ వుంది. కన్నీటి ధారలు కారికారి నానిన గుడిసెల చూరుకళ్ళు ఉబ్బి ముఖం జేవురించింది.

చీకటీకాదు. అది వెలుగూ కాదు. ఏడ్చి ఏడ్చి గుండె బరువు దిగిపోయాక దుఃఖమూ, సంతోషమూ కాని నిస్సత్తువ నిర్వికారతలా వుంది.

అది ఉదయమో సాయంత్రమో తెలియడం లేదు. మూడు రోజుల్నించి ముసురు యిదేవరుస. ఆ చిన్న ప్రపంచం ఆగిపోయింది దినచర్య తప్ప. ఎవరూ పొలం వెళ్ళింది లేదు. పశువుల మేపింది లేదు. పనులు చేసింది లేదు.

ముసురు. ఒకటే ముసురు. బీటలు వారిన నేలతల్లి గుండెల్ని ఆర్ద్రతతో నింపేస్తున్నట్టుగా ముసురు.

పచ్చి. అంతా పచ్చి పచ్చి. ఎక్కడ చూసినా భూమంతా పచ్చగ. ప్రకృతి పచ్చదనాన్ని కడుపారా కన్న "భూమి" బాలెంత పెయిలా పచ్చిగ. పచ్చగ.

ఆ గుడిసె పచ్చి... అది ఉరిసి పచ్చి. అది అటుయిటు తడిసి పచ్చి. చెమ్మగిల్లిన నయనాల్లా పచ్చి. చలికాలంలా చలి... ఈదర చీదర.

మానసిక హింసలా. నెత్తురు కారని హత్యలా. చలి ఈదర. మనసంతా బురద బురద.

కుక్కి నులక మంచం మీద గుడిసెలో ఉన్న మొత్తం బట్టలు ఓ పక్కన. ఉరుసుడుకు సగం తడిసిన దుప్పటి కప్పుకుని వణుకుతున్న గంగపోషం, మరో పక్కన... జ్వరం వచ్చిన పసికందు నిద్రబోతూ మధ్యన... నానిన కట్టెలు, నానిన పొయ్యిలో ఊదుతూ అవస్థపడుతున్న తల్లి ఎల్లవ్వయింకో ప్రక్కన.

"మక్క ప్యాలాలు మా ఎంచుతగని నువ్వు ఈయేడన్న బడికోవాలె బాంచెన్" పూదుతూ వేడుకొంది తల్లి ఎల్లవ్వ గంగపోషంను.

"నీయవ్వ ! నేను పోనుపో" దుప్పటి మరింత గట్టిగా కప్పుకుంటూ అడ్డంగా ఊగుతూ అన్నాడు గంగపోషం.

"ఎందుకుర ?"

"సారు గొడుతడు"

"మంచిగా సదువుకుంటే ఎందుకు కొడుతడు బిడ్డ !"

"నీయవ్వ! ఎప్పుడు సదువుకోవాలె ? ఇంటికత్తె ఈ పని. పంతులింటికోతే ఆడపని. బళ్ళెకోతే సార్లపని. ఇక ఏడ సదువాన్నే"

"బళ్ళె సార్ల పనేందిర"

"నేను మనింటికాడ, పంతులింటికాడ పని జెయ్యంగ సూత్తలేరా సార్లు? బళ్ళె కోయినంక సార్లు గూడ గసొంటి పని జెప్పి అటీటు తోలేసిగ్రు. నేను పోను."

"సదువుకుంటే మంచి నౌకరి దొరుకుతదిర !" బుజ్జగించింది. పచ్చి బాలెంతని విడిచి అక్కడెక్కడో ఉన్న భర్త నౌకరి తలుచుకుంటూ.

"నాకేమద్దు నౌకరి"

"మరేం జేత్తవుర"

"తమ్మున్నెత్తుకుంట, తమ్మున్నాడిత్త. నువ్వు పొద్దుందాక తెల్లందాక పంతు లింట్ల పనిజేత్తే తమ్మున్నెవలాడిత్తరె మరి ?"

"నా కొడుకె" అంటూ సంతోషంగా పుత్రవాత్సల్యంతో కొడుకును రెండు చేతుల్తో నిమిరి నొసట ముద్దు పెట్టుకుంది. వేళ్ళు తన కణతలకు విరుసుకుంది. అంతలోనే...

"మరి పెద్ద పెరిగినంక ఎట్లర? ఏంపని జేసుకొని బతుకుతవుర?"

"నాయిన్న తీర్గ పనిజేత్త"

"నాయిన్న పంతులు కార్కానాల. నేను ఈడ పంతులింట్ల. యిద్దరం పనిజేత్తె సుతం పొట్టకు గడుత్తలేదు. రేపు నీకు లగ్గమై పెండ్లామచ్చినంక నీ పెండ్లాంకేం బెడుతవు? మమ్ములేం జూత్తవు ?"

"నీయవ్వ ! నేను లగ్గమే జేసుకోనుపో"

"నా కొడుకే" అంటూ మళ్లీ ముద్దిడుకొంది.

"ఉఫ్ఫ... ఉఫ్ఫ..." ఊదుతూ మంగులంలోని మక్కలు ఎంచుతున్న సవ్వడి.

"నువ్వు సదువుకోవాలె ! మంచి నౌకరి జెయ్యాలే"

"మరి నేను సదువుకోనుపోతే తమ్మునెవ్వలెత్తు కుంటరె ?"

మంగులంలో ప్యాలాలు చిటపటమంటున్నాయి. ఎంత వేడి ఎక్కువ అవుతే అంత పెద్ద పువ్వుల్లాగా ప్యాలాలు వేగుతాయని యింకా ఊదుతోంది. ఊదడం ఆపింది.

"తమ్ముడు నా దగ్గర్నే ఉంటడు"

ఉరిసిన నీళ్ళతో నిండిన పళ్ళెంలోని నీళ్ళు అవుతల పారపోసి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు గంగపోషం.

చాటలో పోసిన ప్యాలాలు కొన్ని తీసికొని ఒక్కొక్కటి నోట్లేసుకుంటూ నములుతున్నాడు.

"నువ్వు పంతులింట్లనే పని జేసుకుంట ఉంటివి. మరి తమ్ముని ఎవలు ఆడిపిత్తరే ?" తాను లేని లోటు జ్ఞప్తి తెస్తూ.

"నేను పంతులింట్ల పనిజేత్తే నువ్వు తమ్మున్నాడిచ్చుటానికి బడికి పోక ఇంటికాడ వుంటవా ?"

"అవు మరి ! లేకపోతే ఎట్ల ?"

"మన బతుకులెట్లయిపాయెరా ?"

దీర్ఘ నిశ్వాసం.

"గడియ పురసతు లేదు. గవ్వరాకడ లేదు. నా పాసిపని కోసం నువ్వు

సదువు బందుపెడ్తె ఎట్లర ? నేనే ఎట్లన్న సగవెట్టుగుంటగని ఈ యేడన్న నువ్వు బడికి మల్ల వోర"

"మరి ఇంటికాడ కావలి ఎవలుంటరె నువు పనికోతె ?"

మళ్ళీ నిట్టూర్పు. గుడిసె అంతా కలయజూసిన చూపు. కూలే గోడలు... రాలే మన్ను. దురిసిన కమ్మలు... ఉరిసే గుడిసె.బూరుగు చెక్కల తలుపులు.

అదియిల్లు అనే కంటే పందుల కొట్టం అంటే బాగుంటుందేమో. ఎలుకలు, పిల్లులు, కుక్కలు, సొర్రాఎల్లా. మరోసారి నిట్టూర్పు.

తానొక చోట... పెనిమిటి ఒక చోట తలపులు ఒక చోట... తనువులు ఒక చోట... ఏకాంతం... ఎడబాటు...

పిడికెడు మెతుకుల కోసం ఎంత దూరం పోవాల్సి వచ్చింది...
ఎంత మందికి దూరం కావాల్సి వచ్చింది.

ఎన్ని ఆప్యాయతల్ని, ఎన్ని సుఖాల్ని వదులుకోవాల్సి వచ్చింది. చలీ, ఆకలీ దూరం చేయాలని గంగపోషం కరకర నములుతున్న ప్యాలాల చప్పుడు కటకట కిటకిట.

ఎక్కడో బల్లి "కిచకిచ" అంది.
"చొచొచొ" బల్లి పలుకుకు ప్రతిగా పలికింది ఎల్లవ్వ.

"ఏదో మాట వరసకు బడికి పొమ్మన్నదిగని వాడు బడికిపోతె తనకు పని యింట్ల యెల్తదా అసలు ? ఆప్యాయంగా వాత్సల్యంగా, ప్రేమగా అలాజరిగితే మంచిగుండునని ఆశగా అనుకుని అన్నది గని తను అనుకున్నట్టు సాగుద్దా సంసారం."

ఒక్క కొడుకును సాదలేని బీదతనం. ఇంత భారమైన బతుకెందుకో ? మళ్ళీ నిట్టూర్పు. నిశ్వాస.

"మరి పోతగని, నాకు రోజు గిలాసెడు పాలు వోత్తవ ?" మంచంలో అటూ ఇటూ కదులుతున్న తమ్మున్ని జోకొడుతూ గంగపోషం.

"పాలెక్కడియి బాంచెన్ ?"
చాటలోని ప్యాలాల గింజలు ఓ రెండు తీసుకొని నోట్లేసుకుంది.

మంగులం కలుపుతూనే వుంది.

"పంతులింట్ల మూడు బర్లున్నయి గదనె ? నువ్వే పిండుతవు గదనె! నాకు రోజు గిలాసెడు పాలు వొయ్యి. బడికి వోత."

అవును. తాను నిత్యం పిండే పాలు.

తనకూ, తనవాళ్ళకూ చెందని పాలు. పంతులు పాలు.

"అబ్బో! అవి మనయిగాదు. పంతులోల్లయి బిడ్డ! గట్లనద్దు కండ్లు వోతయి."

అటు యిటూ బెరుకుగా చూసింది. కొడుకు మాటలు ఎవరన్నా విన్నారేమోనని.

"మరి పంతులు కొడుక్కు రోజు చెంబెడుపాలు నువ్వే తాగిపిత్తవుగనే"

అవును... నిజమే... తాగిపిస్తుంది. తాగకపోతే ఎంతో బాధపడుతున్నట్టు నటిస్తుంది.

కాని నోరు విడిచి అడిగే తన కొడుక్కు.

ఒక్క చుక్క... ఒక్కటంటే ఒక్క చుక్క... తాగిపిస్తే ఒట్టు.

బర్రె ఈనిన తెల్లారి పంతులమ్మ పెట్టిన జున్న తప్ప.

"మరి అవి..........ఆల్ల బర్లె గద కొడుక"

నీరసం... ఆ మాటలో తనకే విశ్వాసం లేని నిశ్వాసం - నీరసం.

"గీపాటిన్నవాయె! ఊరు మనదిర. ఈ వాడ మనదిరా. బర్లు మనయిర బర్లపాలు మనయిర, దొరఏందిర, దొరతనమేందిర," అక్కిరి బిక్కిరిగా చదివినట్టుగా పాడాడు.

ఉలిక్కి పడింది.

"మెల్లగా పాడు. ఎవలన్న యినజిక్క" అటూ యిటూ మళ్ళీ విసుగ్గా చూసింది.

ఎవరైన వినిఉంటే మళ్ళీ వారి నుండి ప్రమాదం రాకుండా.

"ఈల్లు పంతులోల్లు. దొరలు గాదు గద బిడ్డ!"

"మరి బోరెంల లచ్చిగానోల్ల అవ్వ-గాల్లెవలయో బర్లు జాత్తంది గదనే. ఆల్లు సగం ఈల్లు సగం పాలు తాగుతున్నరు. మరి మనకు సగం పాలు ఎందుకు రావే !"

ఎల్లవ్వ మళ్ళీ బెదురుగొడ్డూ బెరుకుచూపు.

అది మాత్రం నిజం.

సాదడంలో వాల్లకూ తనకూ తేడా లేదన్నది నిజం.

"ఆల్లేమో పాలుకు తీసుకొని సాత్తున్నరు. మనం గట్లకాదు గద. మనం వాల్లింట్ల పని సేసెటోల్లమైతిమి. మనకేమో జీతమిత్తరు."

"ఎంతిత్తరే ?"

"నెలకు ముప్పయి. యింత సల్దిబుల్ది'

"నీ యవ్వ. పొద్దుందాకా తెల్లందాకా నువ్వు అన్ని పనులు జేత్తవు. గడ్డి కోసుకత్తవు. పాలు పిండుతవు. బోల్లు తోముతవు. ముప్పయి జీతమానె ! నీయవ్వ! జీతం బందువెట్టు"

మనసు విప్పి మాట్లాడుకునే సమయం ఎన్నాళ్ళకు దొరికింది. నిత్యం పని. తీరికలేని పని. తీరికలో బయటపడ్డ కొడుకుకు గల తల్లిప్రేమని చూసి నోట మాటరాక ఉక్కిరి బిక్కిరి అయింది. నములుతున్న ప్యాల గింజతో సరం తప్పినట్టయింది. పొడిపొడిగా దగ్గి అదుపులోకి తెచ్చుకొంది. మంగులంల ఏంచిన ప్యాలాలు చాట్ల పోసింది. మరోవాయి మక్కలు పోస్తూ ఉత్సాహంగా అంది.

"మరి బడి కోతవా ?"

"పోత గని. మరి నేను చెప్పినట్టు జెయ్యాలె"

"ఏంటిదిర"

"పంతులు బర్లు మన వాకిట్ల కట్టేసుకోవాలె. మనకు సగం పాలు ఆల్లకు సగం పాలు, నువ్వేమొ పాలమ్ముకుంట ఇంటికాన్నే ఉండచ్చు. పంతులింటికి నువ్వు వోవద్దు. నేను పోనే పోను. యిగ సార్లు నాకు పని జెప్పరు. పంతులు కొడుకు తీర్గ నేను గూడ పాలుదాక్కుంట మంచిగ బడికోత."

నిజమైనా !

"తప్పు ! అట్లనద్దు కండ్లువోతయి."

"ఎందుకే ? పంతులు బర్లకు మొత్తం నువ్వే సగ వెట్టవడితివి. ఆల్ల జాగాలున్నందుకు అన్ని ఆల్లకేనాయె. మరి మన జాగల కట్టేసుకుంటె మనకు సగం పాలు రాద ?"

ఆశ్చర్యం.

అమాయకత్వంలో అన్నీ నిజాలే.

తరం మారితే బలం మారుతుంది.

ఈ సంగతి తనకు తట్టనందుక్కూడా ఆశ్చర్యం.

పనికి పని ఫలితానికి.

పని దోపిడికీ, శ్రామిక భాగస్వామ్యానికీ యింత దగ్గర పోలికలు, తేడాలూ.

ఇన్ని రోజులుగా బండబారిన తన మెదడుకు తట్టనందుకూ –

అనుకోకుండా... అమాయకత్వంలో కొడుకు నోట్లోంచి ముత్యాల్లాంటి నిజాలు జారిపడ్డందుకూ – ఆశ్చర్యం... తమాయించుకొన్న రాజీతనం.

"పెద్ద పెద్దోల్లు గట్ల పాలుకియ్యరు బిడ్డ! నేను గాదంటె ఆల్లు యింకోల్లను జీతం బెట్టుకుంటరు."

"ఎవలుండద్దు జీతం"

"ఎవలూరుకుంటరు బిడ్డ ? పూటకు గతి లేనోల్లు మన తీర్గ ఎందరు లేరు ? గట్ల నువ్వన్నట్టుంటె మంచిగనే ఉండుగని"

మళ్ళీ మంచంలో అటూ యిటూ కదిలాడు. మంచంలోని పసికందును జోకొడుతున్నాడు గంగపోషం.

పొయ్యి మళ్ళీ ఊదుతోంది.

"గక్కడెక్కన్నో నువ్వు యిపుడు పాడిన అసోంటి గా పాటలు పాడెటోల్లచ్చి పాలేరోల్లందర్ని కుప్పేసి జీతం బెంచెదాక పని బందు పెట్టిచ్చి, జీతాలు పెంచిపిచ్చిన్రట. మీ నాయిన్న జెప్తుండె. మొన్న వచ్చినపుడు. మన ఊర్లె గూడ గసోంటోల్లచ్చి అందర్ని కుప్పేత్తె మంచిగుండు."

మొదలైంది... ఎల్లవ్వలోనూ ఆలోచన మొదలైంది...

మొదలైంది, ఏడుపు మొదలైంది. మంచంలో పడుకొని ఏడుస్తున్న పసికందును ఒక్క అంగలో వచ్చి తీసుకుంది.

పసికందు శరీరం మసలుతోంది. వాడికి జ్వరం.

మూడ్రోజుల్నుంచి విడవని ముసురులా ఒకటే జ్వరం.

మందులు లేవు.

ఆ వూళ్ళోనే మందులు అందుబాటులో లేవు.

డాక్టరూ లేడు.

ఆ వూళ్ళో అందుబాటులో ఏ డాక్టరూ లేడు.

పక్క పల్లెనించి ప్రయివేటు ప్రాక్టీసు చేసే కాంపౌండరు ప్రతి రోజు వచ్చేవాడు.

మూడ్రోజుల్నించి బయట బురదలో కాలు తీసి కాలు పెట్టరావడంలేదు. పొరుగూర్నుంచి ఆ కాంపౌండరు సైకిల్ మీద రావడంలేదు.

పెద్ద వాగుపొంగింది. వాగులో పోసిన మట్టితోవ ప్రవాహానికి కొట్టుక పోయింది. నిన్నట్నుంచి తుమ్మలకుంట అలుగువారుత్నుది. గుట్టల్ల ఒర్రెలు ఒకటే పరుగులు.

చెరువులు కుంటలు అన్నీ నిండాయి. ఎటు చూసినా నీళ్ళే. ఆ వూరి చుట్టూ నీళ్ళే, ఆ వూరి తోవలన్నీ బందయినాయి. "పసికందును చంకనేసుకొని పక్క పల్లెలో ఉన్న కాంపౌండరు దగ్గరికి పోదామన్నా పోరాదాయె ! ఎట్లా ? ఏం జెయ్యాలి ?" ఎల్లవ్వ ఆ కొడుకు ముచ్చటమరిసి ఈ కొడుకు గూర్చి మనసు కలికలి అయింది.

మతలబు చెప్పుదామన్నా ఎవలు వోతరు ? పంతులింట్ల ఫోన్ మావుంది. మల్లోసారి అడిగితే ? అబ్బో యింకేమన్న ఉన్నదా ? నిస్సహాయంగా నిట్టూర్చింది,

ఫోన్‌తో పాటు పంతులు, పంతుల్తో పాటు పంతులింట్లోని పని యాదికి వచ్చి ఉలిక్కి పడింది.

"అయ్యో యాల్లయినట్టుంది. కోపానికత్తరేమో ?" అనుకొంటూ పసి కందును జోకొట్టింది. కుక్కి మంచంలో పడుకోబెట్టి రొమ్ము నోట్లో కుక్కింది. పసికందు పాలు చీకకుండానే మళ్ళీ నిద్రబోయాడు. రొమ్ములు సలుపుతున్నాయి. పసికందు మూడ్రోజుల్నించి చీకని పాలు సేవులొచ్చి సలుపుతున్నాయి. పాలు వద్దనుకున్నా ధారలు కారుతూ రవిక తడుస్తోంది. పాలు చీకక శరీరం అంతా సలుపుతూ జ్వరం వచ్చినట్లుగా మెలితిరిగిపోతోంది.

బాధతో కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. కొంగుతో కళ్ళొత్తుకుంది.

తడిసిన రవికను కొంగుతో తుడుచుకొంది. అవి పాలు–

తన పాలు - పుత్ర వాత్సల్యం పాలు-
అలా బాధపడటం తన పాలు-
బాధపడుతూనే పనిచేయడం తన పాలు-
పని చేయడంలో మొదటి పాలు-
అదే మొదటి పాలు !

## చివరి పాలు

ఇంట్లో పంతులు
కుర్చీలో పంతులు
ఫోన్ వద్ద పంతులు.
చీకాకు. ఒకటే చీకాకు.
ఫోన్ పనిచేయక చీకాకు.
ఫోన్ పనిచేస్తే- తన రక్తప్రసారం జరుగుతున్నట్టు.
తన ఫ్యాక్టరీ ఇంటి ఎదురుగా ఉన్నట్టు.
తన ఫ్యాక్టరీ నడుస్తున్నట్టు తనతోనే ఉన్నట్టు.
తన రక్తంలోనే కలిసిపోయినట్టు.
తన రక్తప్రసారం జరుగుతున్నట్టు.

మూర్రోజుల్నించి ముసురు. లైన్ చెడిపోయినట్టుంది. ఫోన్ ఆగిపోయినట్టుంది. తన ఫ్యాక్టరీ ఆగిపోయినట్టు, తన రక్తప్రసారం ఆగిపోయినట్టు, తనలో తను కొట్టుకున్నాడు. గింజుకున్నాడు.

వెలుగులోని చీకటి పెరిగింది.
చీకటిలోని వెలుగు తరిగింది.
ఎల్లవ్వ పనంతా చేసింది.
పనెంతో చేసింది.
తడుస్తు పని చేసింది.

పని చేస్తూ తడిసింది. తడిసిన చలితో వణికింది. గొడ్ల కొట్టంలోకి వెళ్ళింది. రెండు బర్ల పాలు పిండింది. నిండిన పాలచెంబులు ఇంట్లో పెట్టి మరో చెంబుతో వచ్చింది.

అది ఆవు. అది తల్లి లాంటిది. పాలివ్వడమే తప్ప కపటం ఎరుగని ఆవు. అది కరెంటు వెలుగుకు రొచ్చులో ఒరిగింది. దాని ముఖమ్మీద కన్నీటి చారికలు.

అది పెంకుటిల్లు. అది ఉరిసినట్టు లేదు. అయినా చారలు. వర్షపు నీరు ధారగా కారుతున్నట్టుగా ఆ కన్నీటి చారలు. ఆ కళ్ళల్లో బూసులు. ఆ కళ్ళల్లో ఎరుపు. ఆవు ఏడ్చి ఏడ్చి ఆ కళ్ళల్లో ఎరుపు.

"హై" అంటూ ఆవును కదిలించింది. అది నిస్సత్తువతో లేవలేదు. పక్కనున్న చొప్ప బెండుతో కొట్టింది. ఎంతకూ లేవలేదు. ఏంచేసినా లేవలేదు. పల్లిపిండి తౌడు కలిపి కుడితి తెచ్చి ముందు పెట్టింది. అయినా లేవలేదు. వంగి తోక పట్టి లేపింది.లేవలేని ఆవు తోక విసిరింది. అది ఛాతీలో తాకింది.

ఎల్లవ్వ గుండె జల్లుమంది. పాల చెంబు ముందేసుకుని కూలబడింది. ఆవు కళ్ళల్లో పొంగిపొరలే కన్నీళ్ళు. పసికందు గుక్కపట్టి ఏడుస్తున్నట్లుగా ఉలికిపాటు. పసికందుకు జ్వరం. మూర్రోజుల జ్వరం నుంచి ఒక్క బుక్క చీకని పాలు. సేపులొచ్చి తీపులెక్కిపోతున్న పాలు. గడ్డకట్టుకు పోతాయేమోనన్నట్టు సలుపుతున్న పాలు. కస్సున దిగిన సీసా ముక్క చేసిన గాయంలోంచి చివ్వున చిమ్మిన నెత్తురులా రవికని తడిపాయి.

దుఃఖంతో కళ్ళు తిరిగాయి. కళ్ళల్లో నీళ్ళు సుళ్లు తిరిగాయి.

ఈ ఆవు- తాను- దీని దూడ - తన పసికందు లేపలేకపోయింది.

అంతకన్నా బలవంతంగా లేపబుద్ధి కాలేక పోయింది.

నిన్నటి దృశ్యం కళ్ళముందు కదలాడింది.

కోడెదూడ. ముద్దుగా, బొద్దుగా, తెల్లగా పాలలా మెరిసే కోడెదూడ.

మూర్రోజుల క్రితం దాకా ఉన్న కోడెదూడ. మూర్రోజుల ముసురుకు మొన్నటి పగటి నుండి ఏదోలా ఉండి తెల్లారే సరికి శ్వాస వదిలింది.

అదేం రోగమో! చిటుకు రోగం! చిటికెలో మాయం! మొన్న పగటి నుండి ముక్కుల్లోంచి నీరు కారి కారి నాల్గుసార్లు దగ్గింది. అంతే. తెల్లవారే సరికి కట్టె అయిపోయింది. తన కళ్ళెదుట తన ప్రాణం. తన రూపం విల విల కొట్టుకుంటూంటే. తల్లి ప్రాణం ఎంత విలవిల లాడిందో ?

ప్రాణం ఉన్న మనిషి...

నోరున్న మనిషి ఏడ్వగలడు.

ప్రాణం ఉండీ నోరులేని జీవి ఎలా ఏడ్వగలదు ?

మరెవరికి చెప్పుకోగలదు ?

రాయి అయింది. గుండె చెరువయింది. అదే దృశ్యం. తన తల్లి ప్రాణం కకావికలు చేసిన దృశ్యం. ప్రాణం విడిచిన దూడను శ్వాస వుందేమోనని నాలుకతో స్పర్శచూస్తూ మృదువుగా నాకుతున్న దృశం. కాలువలై కన్నీరు కార్చుతున్న దృశ్యం.

అది అప్యాయత. అది మమత.

అది మాటల కందని మౌనరాగం.

అది భాష కందని మౌనరోదన.

అది తల్లి మనసు. అది నోరులేని జీవాల తల్లి మనసు.

అంబా అంటూ గిలగిల కాళ్ళతో తన్నుకున్న దృశ్యం.

కట్టేసిన తనుగును గింజుకుంటూ మెడలు సారిస్తూ- కన్నీరు కార్చుతున్న దృశ్యం. ఆబగా రోజూ తాగే కుడితి బకెటును మూతితో పడగొట్టిన దృశ్యం. ఎల్లవ్వ కళ్ళలో సుళ్ళు తిరిగిన కన్నీళ్ళు.

తల్లి మనసు మేల్కొంది.

అప్పుడనగా వచ్చింది.

పసికందు ఎంతగా ఏడుస్తున్నాడో ?

తల్లి మనసు కీడు శంకించింది.

వీల్లేదు. అలా కావడానికి వీల్లేదు. కోడెదూడలా తన కొడుకు చనిపోవడానికి వీల్లేదు.

వెళ్ళాలి. పసికందును చూసుకోవాలి. వెనుదిరిగింది.

దూరంగా నిలబడి పంతులు వేపు తిరిగింది.

నిన్నటి దృశ్యం. అదే... ఫోన్ చేసి డాక్టర్ను పిలుస్తే మంచిగుండుననుకున్నది. పంతులుకు చెప్పలేక పంతులమ్మకు చెప్పింది. ఎవరికో ఫోన్ చేస్తూ చూసిన ఆ చూపు, ఫోన్ అడగడానికి ఎన్ని గుండెలు అన్నట్టుగా ఆ చూపు.

అది గర్వం... అది కోపం... అది అసహనం.

అది వాటన్నిటిని మించిన మేలిమి చిరునవ్వు.

"ఆ డాక్టరుకు ఫోన్ లేదట" అని తనను చూచిన దృశ్యం.

కళ్ళ ముందు కదలాడి భయంతో వెనుతిరిగింది. పంతులమ్మ చెవిని వేసింది. పంతులమ్మ పంతులుకు చెప్పడానికివచ్చింది ఏమంటాడోనని చూస్తూ దూరంగా ఎల్లవ్వ. దగ్గరగా పంతులమ్మ.

"ఈ రోజు కూడా పొదుగు ముట్టనిత్తలేదట పోనీ తియ్యండి"

విన్నాడు. కనుబొమ్మలు ముడిచాడు. నింగి విరిగి మీద పడ్డట్టు అయ్యాడు.

"నిన్నట్నించి పాలు పిండడం లేదా?'

అది ఆశ్చర్యం... అది అసహనం...

అది ఆజ్ఞ. అది వాటన్నింటిని మించిన చిరునవ్వు.

"అవును. అది నిన్నటి నుంచి ఒకటే కంటికేడు ధారలు. పోనీ తియ్యండి. ఉన్న పాలు చాలు. ముసురు గదా ! తాగడానికి కొనడానికి ఎవరు రావడం లేదు గదా ! పాల వ్యాన్ రోడ్డు పాడై రావడమే లేదు ! పోనీ తియ్యండి ఈ రోజుకు.'

"పాలు మిగులుతున్నయనీ, పాల వ్యాన్ వస్తలేదని పాలు పిండొద్దా ? యివ్వాళ పిండకపోతే రేపు పిండనిస్తుందా ? పిండాలి లేకపోతే అలవాటు తప్పుతుంది. ఆ తర్వాత పాలివ్వడమే మానేస్తుంది. అలవాటు తప్పనీయొద్దు, పాలివ్వడం మాననీయొద్దు."

"చూసుకుంట గూడ ఎట్ల పిండుమంటరు బాంచెను. నిన్నట్నుంచి కుడితి తాగుతలేదు. గడ్డి ముట్టుత లేదు. పన్నకాన్నుంచి లేత్తలేదు. పొదుగు ముట్టనిత్తలేదు. అది దూడబోయిన దుక్కంలున్నది. ఏం చెయ్యాలె ! బాంచెను."

"ఎట్లన్నజేసి అలివి తప్పకుంట చూడాలెగద."

ఆ పలుకుల్లో ఎంత సానునయత.

"సైకిల్ మోటార్నిచ్చి డాక్టర్ను పిలిపించినా అది బతుకకపాయె. నాకు మాత్రం దుఃఖంగా లేదా ! అది బతికుంటే రెండు వేల కోడె దూడ కాకపోవునా ? అది చస్తే నాకు మాత్రం నష్టం గాదా ? అయితే పోయిందానికి ఏడ్చుకుంట కూర్చుంటే పోయింది వస్తదా? పోయింది రాదు కాని ఉన్న ఆవు కూడ పాలు ఎగపెడుతది. నేనొస్త పద పిండుదాం."

కుర్చీలోంచి లేచాడు పంతులు.

విధిలేక మళ్ళీ చెంబు తీసికొని కొట్టంలోకి వెళ్ళింది ఎల్లవ్వ.

ముల్లుగర్రతో నాలుగయిదు బలంగా బాదాడు పంతులు.

"అంబా ! అంబా !"

అరచింది ఆవు.

లేచింది ఆవు... స్థాణువులా నిలబడిపోయింది ఆవు.

ఆవును కొడ్తుంటే విలవిల కొట్టుకొంది ఎల్లవ్వ.

పంతులమ్మ కళ్ళు మూసుకొంది... పంతులు పని నెరవేరింది.

పిండలేక పిండలేక పాలు పిండింది ఎల్లవ్వ.

అలసిపోయాడు. ఆ చిన్న పనికే సొలసిపోయాడు. చలిచలిగా– పంతులు మనసు వెచ్చదనాన్ని వాంఛిస్తోంది.

వేణ్ణీళ్ళతో కాళ్ళు చేతులు కడుక్కొని మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు పంతులు. పంతులు మనసులోని మాట గ్రహించింది. యిల్లాలు. చిక్కగా కాగిన పాల గ్లాసును ఎల్లవ్వతో పంపింది.

చలి – ముసురు – వానలో తడసి శరీరంలోంచి కారిపోయిన వెచ్చదనం కడుపులోకి కావాలని కోరుతున్న ఎల్లవ్వకు పంతులు పాలగ్లాసు చేతుల్లో వెచ్చగా తగిలింది. పాలగ్లాసు అందుకొన్నాడు పంతులు. ఎల్లవ్వ చేతికొచ్చిన వెచ్చదనం చేజారిపోయింది. పని చేసి చేసి తన సత్తువంతా పోయింది.

తన చేతిలోని సత్తువనిచ్చే పాలూ పంతుల్ని చేరిపోయాయి. గోడకు ఒరిగి... ఆపేక్షగా... ఆలోచనగా... అవలోకనగా... వన్నె తరగని మందహాసం. తీపి గుళికల పసిడి పలుకుల సుతి మెత్తని పెదవులు. చీమక్కూడా అపకారం చేయని జీవకారుణ్య తేజస్సుతో విరాజిల్లే ఫాలం – ఆ పంతులు...

పంతులు బడిపంతులు కాదు.

కరణం పంతులూ కాదు

సర్పంచు పంతులూ కాదు.

పంతులు రిజర్వుడు.

ఆ వూరే ఒక పాఠశాల అయితే అతడు పెద్ద పంతులు.

ఆ వూరే ఒక దేశమే అయితే అతడు దానికి రాజు.

అందుకే పబ్లిక్ ఫోన్ వారింట్లోనే ఉంటుంది.

పోస్టాఫీసూ వారింట్లోనే వుంటుంది.

పోస్టాఫీసంటే వేరేగది ఏదీలేదు.

వరండాలో పెట్టెకు తాళం వేసికొని పోవడం రావడం అంతే.

ఫోన్ మాత్రం యింట్లో లోపల ఉంటుంది.

అక్కడి కెవరు పోరు.

ఎవరూ పోలేరు... అంతదూరం అది.

అది అంతరాల దూరం అది.

పంతులు రాజు, ఎక్కడోపెట్టిన పైపుల ఫ్యాక్టరీకి రాజు.

ఆ ఫ్యాక్టరీ ఢీల్లీ అయితే ఈ వూరు తల్లి కన్న కొడుకే ఆ ఢిల్లీ రాజు.

అందుకే జిల్లా కేంద్రంలో రెండంతస్తుల మేడలు మూడుకట్టినా, నాలుగు గదులు తప్ప అంతా ఎవేవో ఆఫీసులకు కిరాయికిచ్చాడు.

అతడు... సాదాగా సీదాగా మల్లెపూవులా, ఖద్దరు లాల్చీలా, ఎంతో సాత్వికుడు.

అతడికి నిష్ట. శాఖాహారం మీద నిష్ట. మాంసాహారం అసలు ముట్టడు. పంతులు జాతిపిత మతం. స్ట్రిక్ట్లీ విజిటేరియన్.

పాలు... తల్లిపాలలా శ్రేష్టమైన పాలు.

ఆడిన మాట తప్పనందుకు మెచ్చుకోలుగా ఆవును ప్రాణాల్తో వదిలేసిన పులి మనసు మార్చుకొని మాంసాహారమే ముట్టనని ప్రతిజ్ఞ చేసి ఆ ఆవుపాలే రోజూ నిష్టగా తాగుతున్నట్టుగా ఆ పాలు.

కోడె దూడపై ఎంత ప్రేమ ?

అటు పులికీ యిటు పంతులికి !

దానికి జలుబు చేసిందో లేదో అలా ఫోన్ చేసి మోటార్ సైకిల్ పంపి డాక్టర్ని పిలిపించాడు.

ఆ చచ్చిన దూడ దెంత భాగ్యం !

తన పసికందుకైనా కలగని భాగ్యం !

ఎంత ప్రేమ ! కోసేదాకా తెలియని కసాయి ప్రేమ.

"ఏందిరా లంజకొడుకా" మీంచి దిగని ఒకనాటి పంతులు

ఈనాడు పూర్తిగా మారిపోయాడు. జాతిపిత మతం పట్టి "రా ! రా ! పోరా!" అనే కోరలు కూడా పీకేసు కొని పాతేశాడు. ఆ పాదే కొత్త, మొగ్గలేసి "తిన్నావా ! బాగున్నావా !" అని పలకరిస్తున్నంత మాత్రానికే ఆ వూర్లో అందరికి ఎంతో సంబరం. అయినా భయం. పంతులు ఆ చూపు చూస్తేనే భయం.

ఆ చూపు... ధ్యానైక ప్రసన్న తీక్షణ మందహాస ప్రేమైక.

ఆవుని చూసి కరిగిపోయిన పులి.

అసలు మాంసాహరమే మానేసినట్టుగా

పంతులు పాలు తాగుతున్నాడు

ఒక్కొక్క బుక్కెడే తాగుతున్న పాలు

రొచ్చులో ఒరిగిన గోవుపాలు పొదుగులోని పాలు, ఎల్లవ్వ రొమ్ములోని పాలు, రవికంతా పాలు, రక్తమంతా పాలు.

తన కండలు, తన పెనిమిటి కండలు, ఎందరివో కండలు ముక్కలు ముక్కలుగా మంచులా కరిగిన గ్లాసులోని పాలు. తన సత్తువ, తన నెత్తురు ఎందరిదో సత్తువ, ఎందరిదో నెత్తురు. కరిగి మరిగి తెల్లనైన పాలు.

ఎర్రని రక్తం - తెల్లని పాలు - అన్నీ పంతులు "పాలు"

రవికంతా పాలు - రక్తమంతా పాలు -

మూడ్రోజుల్నుంచి పాలు చీకక సలుపుతున్న పాలు తానే పాలు. తన పెనిమిటీ పాలు, తన కొడుకూ పాలే.

ఫలితమంతా పంతులు పాలు - కష్టమంతా తమపాలు

అవును. అలివి తప్ప కూడదు. తన పెనిమిటి చచ్చినా తను చచ్చినా, పసికందు చచ్చినా ! అవును. అలివి తప్ప కూడదు. పనిని వదలకూడదు. కడుపునిండ కూడు ఉండకూడదు. అంతే ! పంతులు అంతే !

వీల్లేదు. అలా కావడానికి వీల్లేదు. ఉలిక్కి పడింది.

పసికందు గుక్కపట్టి ఏడుస్తున్నట్టుగా గుండెల్లో గుబులు.

కీడు శంకించింది మనసు.

దీన్ని ఎదిరించాలి.

అప్పుడనగా వచ్చింది.

ఇంకానా !

ధైర్యం కూడ గట్టుకొంది.

ఎంగిలి గ్లాసు తీసి కడుగకుండానే చెప్పకుండానే గబగబ వెళ్ళిపోయింది.

గబగబ వెళ్ళి నిద్రోయిన బాబుని హృదయానికి హత్తుకుంది.

ఒళ్ళు కాలుతున్న జ్వరం.

బయట వర్షం.

ఇంట్లో కన్నీళ్ళ వర్షం

ఒకటే వర్షం.

కాదు.

అవి పాలు.

ప్రకృతి అంతటా పాలు,

అవన్నీ నెత్తుటిపాలు.

**రచనా కాలం 1980**

**- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, జనవరి 1985**

**పాలు కథల సంపుటి, 1991, 2004**

డా. కె. లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో వెలువడిన దళిత కథల సంపుటి. చీకోలు సుందరయ్య సంపాదకత్వంలో వెలువడిన 'మంచికథ' కథల సంపుటి 2005. స్త్రీ శక్తి సంఘటన మొదలైన పత్రికల్లో పునర్ ముద్రణ. ఆంధ్ర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయంలో కొంత కాలం ఎంఏ పాఠ్యాంశం.